ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ

- అత్యాధునిక వసతులతో నిర్మించిన వంద పడకలు, 50 పడకల వైద్యశాలలు
- త్వరలో రోగులకు అందుబాటులోకి రానున్న భవనాలు





అత్యాధునిక వసతులతో నిర్మించిన వందపడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నూతన భవనం, మాతాశిశు సంరక్షణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన 50 పడకల నూతన భవనం

ఆదోనిటౌన్ : ఆదోని ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టారు. ఇందుకు నాడు–నేడు కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన, నాణ్యమైన, ఆధునిక పరికరాలతో వైద్యం అందుబాటులో ఉండాలని చర్యలు చేపట్టారు. పట్టణంలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులకు అత్యాధునిక వసతులతో నూతన భవనాలను నిర్మించారు. త్వరలో నూతన భనవాలు అందుబాటులోకి రానున్నాయి. ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, మాతా శిశుసంరక్షణ కేంద్రం అన్ని విధాలుగా అభివృద్ధి చేశారు. రెండు ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అనుగుణంగా గదులు, వార్డులు, ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బంది పోస్టుల భర్తీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పాడుబడిన భవనాల్లోనే ఆస్పత్రులను కొనసాగించారు. ఏరియా ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నాడు–నేడు పథకం కింద అత్యాధునిక వసతులతో వంద పడకల భవనాన్ని చేపట్టారు. మాతా శిశుసంరక్షణ కేంద్రంలో జాతీయ ఆరోగ్యమిషన్ (ఎన్ఆర్‌హెచ్ఎం) పథకం కింద రూ.7 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించారు. ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులు కూడా భర్తీ అయ్యాయి.ఎన్నికల ముందు ఆదోని పర్యటనకు వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారమే ప్రభుత్వ ఆస్పత్రులను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు. ఆస్పత్రుల్లో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపారు. లేబరేటరీలు, ఎక్స్‌రే, స్కానింగ్ రూమ్‌లు, రక్త పరీక్ష గదులు, ఫార్మసీ, డాక్టర్ల గదులు, సిబ్బందికి అనుగుణంగా గదుల నిర్మాణం, వైద్యసేవలు, రోగులకు అన్ని రకాల వసతులు కలిస్తూ నిర్మాణాలు చేపట్టారు.

సంతోకరం



ఆదోనిలో నిర్మించిన రెండు ప్రభుత్వ ఆస్పత్రుల భవనాలతో 150 పడకల భవనాలు అందుబాటులోకి రానుండటం సంతోషకరం. వీటితో రోగులు ఇతర ప్రాంతాలకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన అవసరం ఉండదు. స్థానికంగానే నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వం చర్యలు చేపట్టడం అభినందనీయం. అన్నిరకాల జబ్బులకు డాక్టర్లు స్థానికంగా ఉండి వైద్యం చేయనుండటంతో రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది.

– లక్ష్మి, రాయచోటి సుబ్బయ్య కాలనీ

రోగుల కష్టాలకు చెక్



పట్టణంలో ఏరియా, మాతాశిశు కేంద్రానికి నూతన భవనాలు నిర్మించడం, మెరుగైన వైద్యం అందించేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించడం హర్షణీయం. విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారు. చాలామంది పేదలు ఇతర ప్రాంతాలకు వెళ్లి వైద్యసేవలు పొందాల్సిన అవసరం ఉండదు. సౌకర్యాలు లేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉండదు.

– ఖలీద్‌బాషా, కౌడల్‌పేట

త్వరలోనే ప్రారంభం కానున్నాయి

ఏరియా ఆస్పత్రిలో నిర్మించిన వంద పడకల భవనాన్ని త్వరలోనే ప్రారంభించనున్నాం. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సహకారంతో మాతాశిశు సంరక్షణ కేంద్రంలో భవనాలను నిర్మించడంతో రోగులకు అందుబాటులోకి రానున్నాయి. ఇక నుంచి ఒకే మంచంపై ఇద్దరు పడుకొని వైద్యం పొందే పరిస్థితి ఉండదు. ఆదోని మండలంలో దాదాపు 15 లక్షల జనాభాకు అనుగుణంగా వంద పడకలు, 50 పడకల భవనాలను నిర్మించి సౌకర్యాలు కల్పించారు.

– రవికుమార్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపిక



విద్యార్థి రామకృష్ణ

ఆదోనిసెంట్రల్ : రాష్ట్రస్థాయి జంప్ రోప్ క్రీడా పోటీలకు ఆదోనిలోని నేషనల్ ఇంటర్ కాలేజీలో సీఈసీ మొదటి సంవత్సరం విద్యార్థి పి.రామకృష్ణ ఎంపికయ్యాడని కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. ఈనెల 30వ తేదీన కర్నూలులోని ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన కర్నూలు జిల్లా జంప్ రోప్ ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటడంతో ఎంపిక జరిగిందన్నారు. సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. ప్రిన్సిపాల్ ఫణిశేఖర్, అధ్యాపకులు ఉన్నారు.

విరుపాక్షిస్వామికి జాతీయ సేవా రత్న పురస్కారం



అవార్డు అందుకున్న విరుపాక్షిస్వామి

ఆదోనిఅర్బన్ : జనసేవా సామాజిక సేవా సంస్థ కార్యదర్శి విరుపాక్షిస్వామికి జాతీయ సేవా పురస్కారం లభించింది. బుధవారం విరుపాక్షి స్వామి మాట్లాడుతూ.. ఈనెల 29న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కొమరయ్యహాల్‌లో.. గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు 161వ జయంతి వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా ఆయా రంగాల్లో సేవలు అందించిన వారికి పురస్కారాలు అందజేశారు. అలాగే..జనసేవా సామాజిక సేవా సంస్థ కార్యదర్శి విరుపాక్షిస్వామికి జాతీయ సేవా పురస్కారం అందజేసి సన్మానించారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, వనపర్తి జిల్లా ఏఎస్పీ రాందాసుతేజవత్ నుంచి పురస్కారం అందుకున్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

పెద్దకడబూరు : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డీఎస్ఎఫ్ విద్యార్థులు వీర, శివ కోరారు. మండలంలోని కంబలదిన్నె గ్రామ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారు వంట ఏజెన్సీ, హెచ్ఎంతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేదని, ఉడికీ ఉడకని అన్నం విద్యార్థులకు పెడితే ఎలా తింటారని ప్రశ్నించారు.మెనూ ప్రకారం భోజనాన్ని అందించడంతో పాటు నాణ్యత పాటించాలని కోరారు. తిమ్మప్ప, మల్లి, సల్మాన్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

ఆదోనిరూరల్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతు, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సీనియర్ నాయకులు ఈరన్న, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని బుధవారం సమరభేరి కరపత్రాలు, పోస్టర్లను స్థానిక సుందరయ్యభవన్‌లో విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని అంబేడ్కర్ నగర్, కార్వన్ పేట, ఇందిరానగర్, మండిగిరి, ఎస్‌కేడీ కాలనీ, షేర్‌ఖాన్ కొట్టాల తదితర ఏరియాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. రామానాయుడు, అంజి, శివ, రామంజి, మోహన్, భీమ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన వెంకటనాయుడు

ఆదోనిసెంట్రల్ : ఆదోని–ఇస్వీ రైల్వే స్టేషన్‌ల మధ్య 498/33–34 నంబర్ రాయి వద్ద మెయిన్ అప్ లైన్ ట్రాక్ పక్కలో వెంకటనాయుడు (68) గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ రామస్వామి బుధవారం తెలిపారు. మృతుడు ఆదోని పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలో నివాసి అని, తన ముగ్గురు కుమారులు ప్రయోజకులు కాలేదని, ఆస్తి పంపకాల విషయంలో గొడవలు తలెత్తడంతో గూడ్స్‌కు ఎదురెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం రవాణాదారుల అరెస్టు

ఆదోనిరూరల్ : అక్రమంగా కర్ణాటక మద్యం రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ బుధవారం తెలిపారు. మండలంలోని ఇస్వీ గ్రామంలోని జోడి బసవన్న గుడి వద్ద ఆదోని పట్టణానికి చెందిన బోయ దుబ్బ నరసింహులు, బోయ విజయ్ మోటార్ సైకిల్‌పై 18 బాక్సుల ఓసీ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యాన్ని రవాణా చేస్తుండగా దాడి చేసి పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకుని, బైకు సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. దాడులో సెబ్ ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, శివ, పీసీలు శ్రీనివాస్, రోహిన్, సుధాకర్ పాల్గొన్నారు.

ఘర్షణ - కేసు నమోదు

ఆదోనిరూరల్ : మండలంలోని బలదూర్ గ్రామంలో స్థల వివాదంపై జరిగిన ఘర్షణలో 15 మందిపై కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఒక వర్గం ఫిర్యాదు మేరకు మాబాషా, హనీఫ్, చాంద్‌బాషా, తాయర్‌బాషా, ఖాజాపై, కౌంటర్‌గా మరో వర్గానికి చెందిన జైతున్‌బీ ఫిర్యాదు మేరకు విజయభాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, ఆనందరెడ్డి, ఖాజా, మహబూబ్ బాషా, మన్సూర్, జిలాన్, రాఘవరెడ్డి, షంషాద్‌పై కేసులు నమోదు చేశామని వివరించారు.

రెగ్యులర్ వార్డెన్‌లను నియమించాలి

ఆదోనిసెంట్రల్ : మండలంలో హాస్టళ్లకు ఇన్‌చార్జ్‌లను కాకుండా రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధణాపురం ఉదయ్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఒకే వార్డెన్ రెండు, మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తే విద్యార్థులను సక్రమంగా పట్టించుకోరన్నారు. ఇప్పటికే హాస్టళ్లలో కనీస వసతులు లేవని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయడం లేదని, వారి సమస్యలను పట్టించుకునే నాథులేడని ఆవేదన వ్యక్తం చేశారు. కిరణ్, సూరి, విక్రమ్, అరుణ్‌తేజ, భాస్కర్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు మరో అవకాశం

కౌతాళం: కస్తూర్బా విద్యాలయాల్లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో చేరడానికి ప్రభుత్వ మరో అవకాశం కల్పించిందని ప్రిన్సిపాల్ పుష్పలత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఎంపీసీ గ్రూపులో చేరడానికి అవకాశం ఉన్నందున మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న బాలికలు పదవ తరగతి పూర్తి చేసి ఉంటే దరఖాస్తు చేసువాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటింటి సర్వే పూర్తి

- తుది ఓటర్ల జాబితా రూపొందించేదుకు చర్యలు చేపడుతున్నాం
- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్ : ఇంటింటి సర్వే 99.70 శాతం 2,51,573 ఓటర్లు గానూ 2,50,821 మంది ఓటర్లును సర్వే పూర్తి చేశామని, స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 కార్యక్రమాన్ని విజయవంతంగా ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన తుది ఓటర్ల జాబితాను జనవరి 5వ తేదీన ప్రచురించేందుకు తగిన చర్యలు చేపడతామని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్–2024పై తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, డీఎల్‌పీఓ శ్రీనివాసులుతో కలిసి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సబ్‌కలెక్టర్ సమావేశమయ్యారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సర్వే మరియు స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి ఎలంటి లోపాలకు ఆస్కారం లేకుండా జనవరి 5న పటిష్టమైన తుది ఓటర్ల జాబితాను రూపొందిస్తామన్నారు. అందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి వారి ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో ఎక్కడ కూడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బాధ్యతాయుతంగా నిర్వహిస్తామన్నారు. ఏఈఆర్ఓ, బూత్ లెవెల్ అధికారులకు ఇప్పటికే స్పెషల్ సమ్మరీ రివిజన్–2024కి సంబంధించిన శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. నూతన ఓటర్ల కోసం స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి, 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు ప్రాధాన్యతను వివరించి నూతన ఓటర్లుగా ఏర్పాటు చేసేందుకు వారి నుంచి సంబంధిత పత్రాలు తీసుకొని జనవరి 5న ప్రచురించనున్నట్లు చెప్పారు. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తామని వివరించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీది నీతిమాలిన రాజకీయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మంత్రాలయం : ఇసుక విషయంలో టీడీపీ నీతిమాలిన రాజకీయం చేస్తోందని ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టనగౌడ్, ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షుడు ఐరన్‌గల్ శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. బుధవారం కోసిగి ఎంపీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ఎంతలా ఇసుక దందా చేశారో ప్రజలకు తెలిసిందేనన్నారు. ఇసుక, మట్టి మాఫియా చేసింది టీడీపీ నాయకులేనని గుర్తు చేశారు. ఇవేమీ ఎరుగనట్టు కొత్తగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇసుక దందా చేస్తున్నారంటూ ఇసుక రీచ్‌లపై హంగామా చేయడం హాస్యాస్పదమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇసుక పాలసీని తెచ్చి ఎక్కడా దందాకు ఆస్కారం లేకుండా చేశారని పేర్కొన్నారు. ఇవేమి గుర్తించని టీడీపీ ఇన్‌చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి గుడికంబాళి రీచ్‌లో ఆందోళన చేయడం విడ్డూరమన్నారు. కేవలం జనాలను రెచ్చగొట్టమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని వివరించారు. తిక్కారెడ్డి ఎన్ని కుయుక్తులు పన్నినా నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మాజీ ఎంపీపీ మాణిక్యరాజు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మహంతేష్‌స్వామి, నాయకులు నాడిగేని నాగరాజు, నరసింహులు, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను ఉపయోగించుకోవాలి

కౌతాళం: మండలంలో వంద రోజులు ఉపాధి పనులు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ కల్పిస్తున్న శిక్షణను ఉపయోగించుకోనే చూడాలని ఉపాధి సిబ్బందిని ఎంపీడీఓ సుబ్బారాజు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతలో నైపుణ్యం పెంపొందించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మండలానికి సంబంధించి 2022–23 ఏడాదికి గాను 119 కుటుంబాలు వంద రోజులు, అలాగే 2023–24కు గాను ఇప్పటి వరకు 70 కుటుంబాలు వంద రోజులు పూర్తి చేసుకున్నాయన్నారు. వారిలో వారి విద్యార్హతను బట్టి 18–30సంవత్సరాల లోపు ఉన్న యువతీ యువకులకు బి.తాండ్రపాడు, ఎమ్మిగనూరు, ఆదోనిలో జరిగే మూడు నెలల శిక్షణకు పంపాలని చెప్పారు. శిక్షణ కాలంలో వసతి మరియు భోజన సదుపాయంతో పాటు రోజుకు రూ.272 ప్రకారం స్టైఫండ్ ఇస్తారని తెలిపారు. ఏపీఓ జుబేర్ అహ్మద్, ఏపీఎం రాజశేఖర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

3న ఉచిత గుండె, కంటి వైద్యశిబిరం

ఆదోనిఅర్బన్ : సెప్టెంబర్ 3న ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో శాంతిరామ్ ఆస్పత్రి సౌజన్యంతో పట్టణంలోని చిన్నశక్తి గుడి వద్దగల జీహేశ్వర పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్ఐ,ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షుడు నగేష్ కాకుభాల్ తెలిపారు. బుధవారం పట్టణ అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా మాట్లాడుతూ వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి వైద్యుల సలహా మేరకు ఆపరేషన్లు అవసరమైన వారికి నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రిలో ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లి చేయిస్తామని చెప్పారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యదర్శి మిరియాల శ్రీధర్ మాట్లాడుతూ నిరుపేదలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవోపా ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్నశెట్టి, రంగా, సభ్యులు రఘు, మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు సంగీత, వంకదారు మమతశ్రీ, బిందు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్‌లను ఆదుకోవాలి



మూతబడిన డాక్యుమెంట్ రైటర్‌ల షాపులు

ఆదోని రూరల్ : సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన వ్యవహారాలను నేరుగా ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో తమకు అన్యాయం జరుగుతుందని డాక్యుమెంట్ రైటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద తమ షాపులను మూసివేసి నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం వల్ల తాము ఉపాధి కోల్పోతామని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిర్ణయం సరైనదే



రిజిస్ట్రేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నూతన విధానం మంచిదే. అమ్మకందారుడు, కొనుగోలుదారుడు వివరాలు సక్రమంగా లేకపోతే రిజిస్ట్రేషన్లు జరగవు. అన్ని వివరాలు సక్రమంగా ఉంటేనే రిజిస్ట్రేషన్‌లు అవుతాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంతో డాక్యుమెంటర్ రైటర్‌లు నిరసనలోకి వెళ్లారు. దీంతో రిజిస్ట్రేషన్‌లలో జాప్యం జరుగుతోంది. ఆదోనిలో డాక్యుమెంటర్ రైటర్లు నిరసన చేయడంతో బుధవారం కేవలం రెండు రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. నూతన నిర్ణయానికి ప్రజలు అలవాటుపడేందుకు కొంత సమయం పడుతుంది.

– రాజశేఖర్, ఆదోని సబ్ రిజిస్ట్రార్

మరమ్మతులు చేయించరూ!



ఆదోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా మారిన ఆర్వో ప్లాంటు

ఆదోనిసెంట్రల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు మంచినీటిని అందిస్తోంది. రోజూ వాడటం వల్ల ప్లాంట్ మరమ్మతులకు గురైనా మరమ్మతులు చేయించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఆర్ఆర్‌లేబర్ కాలనీలోని మున్సిపల్ పాఠశాల, కల్లూబావిలోని మున్సిపల్ పాఠశాలల్లో ఉన్న ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారాయి. దీంతో విద్యార్థులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

3న దేవరగట్టులో టెంకాయ వేలం

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి దసరా బన్ని ఉత్సవాల్లో టెంకాయల విక్రయానికి సెప్టెంబర్ 3న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామ పెద్దలు బుధవారం విలేకరులకు తెలిపారు. వేలం పాటలు ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. వేలం పాడదల్చిన వారు ముందుగా రూ.5 వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

పోలీస్ బందోబస్తు మధ్య ఆస్పరి మార్కెట్ వేలం

ఆస్పరి: స్థానిక కూరగాయల మార్కెట్ హక్కుల వేలం బుధవారం ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఆస్పరి, చిప్పగిరి ఎస్ఐలు వరప్రసాద్, రమేష్ బాబు, పోలీసుల బందోబస్తు మధ్య జరిగింది. పంచాయతీ అధికారులు నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయిలో రూ.56లక్షలు వేలం పలికింది. వేలం ప్రారంభంకాక ముందు రెండు సంవత్సరాలకు సంబంధించి కూరగాయల మార్కెట్ వేలం ద్వారా గ్రామాభివృద్ధికి తీసిపెట్టిన రూ.10లక్షలను గతేడాది మార్కెట్ హక్కు దారుడు దబ్బల నరసప్ప గ్రామస్తుల సమక్షంలో సర్పంచ్‌కు ముట్టజెప్పారు.మిగతా మార్కెట్ వేలం డబ్బులు వ్యవహారం కోర్టులో ఉన్నందున ఆసమస్య పరిష్కారమైన తరువాత డబ్బు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నానని దబ్బల నరసప్ప గ్రామస్తులకు చెప్పారు. ఆతరువాత సర్పంచ్ మూలింటి రాధమ్మ, పత్తికొండ డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో ఈఓ రామాంజినేయులు 2023–24వ సంవత్సరానికి కూరగాయల మార్కెట్ వేలం నిర్వహించారు. అయితే ఈ ఏడాది కూడా గ్రామాభివృద్ధికి డబ్బులు తీసి పెట్టాలని గ్రామస్తులు అధికారులను కోరారు. కాగా, బహిరంగ వేలంలో ఎంత మొత్తం పాడితే అంత మొత్తం పంచాయతీకి చెల్లించాల్సిందేనని అధికారులు చెప్పడంతో గ్రామస్తులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. గ్రామస్తులు పట్టుబట్టడంతో వేలం పాటలో 25శాతం గ్రామాభివృద్ధికి కేటాయిస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఈరన్నస్వామి దర్శనానికి తరలివస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి,



క్యూలో వేచి ఉన్న భక్తులు

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మూడవ గురువారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి బుధవారం నుంచే భక్తులు తరలివచ్చారు. దీంతో క్షేత్రం భక్తులతో బుధవారం సాయంత్రం నుంచే కిటకిటలాడుతోంది. భక్తులు క్యూలైన్‌లో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. మూడవ సోమవారం, మూడవ గురువారానికి ప్రత్యేకత ఉండడంతో ఈ వారల్లో స్వామి వారి దర్శనానికి భక్తులు తండోపతండాలుగా వచ్చి దర్శించుకుంటారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో పిండి వంటలు వండి నైవేద్యం సమర్పించారు.

ఓర్వలేకనే విమర్శలు

కౌతాళం: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్ పేర్కన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం తెలుగు దేశం నేతలు సత్యాగ్రహ సభ ఏర్పాటు చేసి అసత్యాలు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర రైతు సంఘం ప్రధానకార్యదర్శి ఆడివప్పగౌడ్ హాల్వి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు దగ్గర సెల్ఫీ చాలెంజ్ చేయడం హాస్యస్పదమన్నారు. గత ప్రభుత్వ హయంలో 16గ్రామాలకు రూ.10 కోట్లతో 30ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టామని గొప్పలు చెప్పుకుంటున్న వారికి అదనపు పైప్‌లైన్, మోటార్ చేర్పాటు చేయాలనే ఇంగిత జ్ఞానం లేదా అన్ని ప్రశ్నించారు. నాలుగా సంవత్సరాల నుంచి 16 గ్రామాల ప్రజలకు కుళాయిల ద్వార తాగునీరు అందించడం లేదనడం దుర్మార్గమన్నారు. ఇసుక రీచ్‌లో ఎలాంటి అక్రమాలు జరగడం లేదని,అన్ని వాహనాలకు బిల్లులు చెల్లించే ఇసుకును తోలుకుంటున్నారనేడి అందరికీ తెలిసిందేనన్నారు. కేవలం ఓర్వలేక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇసుక దందా జరుగుతుందని తిక్కారెడ్డి ఆరోపించడం సరికాదన్నారు.



మూలరాముల పూజలో హారతులు పడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



బంగారు పల్లకీ సేవలో భక్తులు

వేదభూమి మంత్రాలయంలో రాఘవుడి ఆరాధనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంచాలమ్మ, మూల బృందావనాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి విశేష పూజలు చేపట్టారు. - మంత్రాలయం



ఆరాధనోత్సవాలకు హాజరైన భక్తులు



కళాబిందు బృందం భరతనాట్యం